4.12.1998 శుక్రవారం 12 పేజీలు సంపుటి: 70 సంచిక: 49 విడిప్రతి రూ. 2.00లు Phone: 327354 Regd. No. HNL 18

# జమీన్‌రైతు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు

జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

జమీన్‌రైతు

**ప్రకటన కర్తలు ... చందాదారులకు మనవి**

జమీన్‌రైతు పాత చందా దారులుగాని, క్రొత్త చందాదారులు గాని, ప్రకటన కర్తలుగాని తాము చెల్లించు చందా లేక ప్రకటన ఖర్చు మా ఆఫీసులోగాని లేక బిల్ కలెక్టర్ వద్ద మాత్రమే చెల్లించి రసీదు తీసుకోండి. పేపర్ బాయిస్ వద్దగాని, ఇతరుల వద్దగాని చెల్లించిన మేము బాధ్యులము గాము.

# తెలుగునేతల దౌష్ట్యం శ్రుతిమించింది!

పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకలతో కాని పోవని సామెత; ఆత్మకూరు ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యా నాయుడు గారికి అధికారులను పురుగుల వలె దులపరించి పారేయడమనే సద్గుణం ఆది నుంచీ వుంది. వేజర్ల పొలిమేరలు దాటి కూడా ప్రపంచమనేది ఒకటి వుంటుందని తెలియని రోజులలోనే అక్కడి విడిటలపైన, ఎమ్డీటల పైన తన చేతి వాటం ప్రదర్శించిన ఘనుడాయన. ఎమ్మెల్యే అయిన తర్వాత ఆ నోట దురద, చేతితీట మరింత ఎక్కువైనాయి. మొక్కగా వున్నప్పుడు వంచనిదే మానైన తర్వాత వంగుతుందా అన్నది లోకోక్తి! ఎమ్మెల్యే అయిన తర్వాత ఆయన ఒక ఎమ్మార్వోను తన్నాడు; ఒక ఎగ్జిక్యూటివింజనీరును క్రింద పడద్రోశాడు; సాక్షాత్తు మంత్రి గారి గదిలో. సాటి తెలుగునేతకు పులగం పెట్టాడు; ఎందరో జిల్లా అధికార్లను బెదరించి, భయపెట్టి తను ఇచ్చిన కాగితాలన్నింటిపైనా వారు సంతకాలు చేయక తప్పని పరిస్థితి కల్పించాడు. వీటన్నింటినీ వున్నతాధికారులు చోద్యం తిలకించినట్లు తిలకించారు. ఒకసారి గాకుంటే ఒకసారైనా అదేమని అడగలేదు, మందలించ లేదు. ఫలితం? భస్మాసుర వరం వలె అది తమకే తగిలింది; మాడు పగిలేటట్లు కారం నషాలానికి అంటినట్లు తగిలింది.

30తేది ఉదయం జరిగిన జిల్లా అభివృద్ధి మండలి సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి వై.శ్రీలక్ష్మిపై తన దౌష్ట్యం ప్రదర్శించాడు లక్ష్మయ్యనాయుడు. సహచర ఎమ్మెల్యేలు చేయిపట్టి వెనక్కు లాగినందు వల్లనే, లేక ఆమె మహిళ అనే సంకోచంతోనే ఉద్రేకం నిలుపరించు కోవడం వల్ల కలెక్టర్‌గారికి కేవలం మాటల అవమానం మాత్రమే జరిగింది. ఆ స్థానంలో మరొకరు వుండివుంటే, ఆ క్షణంలో ఆయనలోని ఉన్మత్త స్థితి ఏ విపరిణామాలకు కారణమై వుండేదో వూహించడం కష్టం.

పాత కలెక్టర్ డాక్టర్ సాంబశివరావు వున్నప్పుడు లక్ష్మయ్యనాయుడు గారిది ఆడింది ఆట, పాడింది పాటగా వుండేది. వీరిద్దరి మధ్య ఆత్మీయతకు కారణం ఏమిటో మనకు తెలియదుగాని, లక్ష్మయ్యనాయుడు కాగితం ఇస్తే, అదే వుత్తర్వుగా మారేది.

## కలెక్టర్‌కే రక్షణ లేకపోవడం సిగ్గుచేటు కాదా?

జన్మభూమి పనుల విషయంలో మరీనూ! తాననుకున్న పని జరిపించేసి, ఆ తర్వాత చెప్పిపంపేవాడు - బిల్లు రెడీ చేయించమని; ముందు చెక్కు వ్రాసి, ఆ తర్వాత తీరికగా పనుల ఎస్టిమేషన్లు, మంజూరు వగైరా తతంగం జరిపించేవారు. అయితే ఆయన వున్నట్లుండి బదలీ అయిపోవడంతో ఎమ్మెల్యేగారు ఇరుక్కుపోయారు. ఆ పాత పనులకు సంబంధించి 80 లక్షల రూపాయలు ఇమ్మని ప్రస్తుత కలెక్టర్ శ్రీమతి శ్రీలక్ష్మిని అడిగాడట. అయితే పనుల మంజూరు లేకుండా బిల్లులు చెల్లించడం అసాధ్యమని కలెక్టర్ గారు తిరస్కరించారు. కాని లక్ష్మయ్య పట్టు వీడలేదు. మంత్రుల చేత చెప్పించాడు; ముఖ్యమంత్రికి మొరపెట్టుకున్నాడు. ఎవ్వరూ అందుకు వప్పుకోలేదు. రేపు జనవరిలో ప్రారంభం కాబోయే జన్మభూమిలో ఈ పనులు జరిగినట్లు రికార్డు చేయించి, బిల్లు తీసుకోమని చెప్పారట. గ్రుడ్డుపెట్టే కోడి పడే బాధ ప్రక్కనుండి చూసే వారికేమి తెలుస్తుంది? రేపటి జన్మభూమిలో ఈ పనులు చూపిస్తే కొత్త పనులు రావు; కొత్త బిల్లులు రావు. వీటిని ఇప్పుడే దండుకొంటే, అప్పుడు వేరే బిల్లులు డ్రా చేసుకోవచ్చు. అందులోనూ ఈ పనులన్నింటినీ తన స్వంత ఎక్స్‌కవేటర్లతో చేయించా రాయన. డబ్బు రాకుంటే ఆ నష్టమూ తన స్వంతం! అందువల్లే మంత్రుల ఉచిత సలహాలు ఆయనకు నచ్చలేదు.

సామ, దాన, భేదోపాయాలు ఫలించక పోవడంతో చివరిగా దండోపాయం ప్రయోగించాడు. జిల్లా అభివృద్ధి మండలి సమావేశం ప్రారంభం కాగానే ఈ ప్రస్తావన తెచ్చాడు. కాని కలెక్టర్ ఎప్పటి వలెనే సమాధానం చెప్పారు. అది ఆయనకు ఆగ్రహం తెప్పించింది. కలెక్టర్‌పై తిట్ల దండకం ప్రారంభించారు. ఏకవచనంతో సంబోధిస్తూ అసభ్యకరంగా మాట్లాడడం ప్రారంభించారు. మంత్రులు ఆపినా ఆగలేదు. కలెక్టర్‌గారు అభ్యంతరం చెప్పేకొద్దీ ఆయనలో పూనకం పెరిగి పోయింది. ఆవేశంతో వూగిపోతూ గొంతుమరీ పెంచి ఆరున్నొక శృతిలో దూషణ రాగం ఆలపించాడు. పాపం కలెక్టర్ గారికి నోట మాట రాలేదు; కంటిలో నీళ్లు నిండాయి. ప్రక్కనుండే మంత్రి పరసారత్నంకు ఫిర్యాదు చేసింది; కాని ఆయనలో ఉలుకు, పలుకు లేదు. సమావేశంలో ఉద్రిక్తత పెరిగిపోయింది. తమందరికీ పై అధికారి అయిన కలెక్టర్‌కు ఈ అవమానం జరగడం తతిమావారు చూడలేక పోయారు. డిఆర్‌ఓ, డిఆర్‌డిఎ పిడి వంటి వారు లేచి ఎమ్మెల్యే ప్రవర్తన పట్ల అభ్యంతరం చెప్పారు.

అప్పటి వరకు ఎమ్మెల్యే ఎంత నోటి దురుసుగా ప్రవర్తించినా పట్టించుకోని ఇన్‌ఛార్జి మంత్రి దేవినేని రమణ అభ్యంతరం చెప్పిన అధికారులపై మాత్రం గయ్‌మని విరుచుక పడ్డాడు. "ఎమ్మెల్యేలకు మాట్లాడే హక్కు వుంటుంది. లక్ష్మయ్యనాయుడు కలెక్టర్‌ను తిట్టలేదు; తన ఆవేదన చెప్పుకొన్నాడు; కొంచెం తొందర పడ్డాడంతే; అంతమాత్రానికే మీరు నిరసన చెప్పి, వాకౌట్ చేస్తారా! మీరు తప్పులు చేయడం లేదా? ఇదేమన్నా అసెంబ్లీ అనుకున్నారా - వాకౌట్లు చేయడానికి? నోరు మూసుకొని కూర్చోండి.

తరువా 7వ పేజీలో

Free Service
*(with Flowers, Chocolates & Lots of smiles!)*

**THE TITAN FREE SERVICE WEEK.**
**5th Dec. To 12th Dec. '98**

మీ చేతి గడియారాలు తీసుకురండి. అవి ఎంత పాతవైనా సరే మా అధీకృత సర్వీసు సెంటరులలో ఆ గడియారాలకు స్ట్రాపులు బిగిస్తాము. బ్యాటరీలు మారుస్తాము. చెమ్మపట్టిన డయిల్స్ శుభ్రం చేస్తాము. వాచ్ సరిగ్గా పనిచేస్తున్నది లేనిది చెక్ చేస్తాము. ఒక్క ముక్కలో చెప్పాలంటే మీ గడియారాలను నిత్య నూతనంగా, తిరిగి మామూలుగా పనిచేసేటట్లు చేసి మీకు ఆనందాన్ని కలిగిస్తాం!

TITAN
CUSTOMER SERVICE

సర్వీస్ ఉచితం. స్పేర్స్ ఛార్జి అదనం.

ది వరల్డ్ ఆఫ్ టైటాన్, 16/245, ట్రంక్ రోడ్, నెల్లూరు - 524001. ఫోన్: 325148

6.12.1998 తేది ఉదయం 10.15 గంటలకు నూతన ప్రారంభం

హేమ లాడ్జి

సింగిల్ రూములు,
మడత మంచములు కలవు

జి.వి.యస్. కాంప్లెక్స్, మోడరన్ స్టోర్స్ దగ్గర, ట్రంకు రోడ్డు, నెల్లూరు

# 'నీళ్లు' కాదు, నా 'కోళ్లూ' చూడండి!

సోమశిల ప్రాజెక్ట్ కాలనీ క్యాంపస్ మెయింటినెన్స్ అధికారి తన క్రింది స్థాయి ఉద్యోగుల చేత వెట్టి చాకిరీ చేయిస్తున్నారు. 4 నెలల క్రితం ఇక్కడ ఎస్ఓగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అధికారి తన క్రింద పనిచేసే 50 మంది ఉద్యోగులను ముప్పుతిప్పలు పెడుతూ మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నాడు. కోళ్ల పెంపకం పట్ల

## సిబ్బందికి సోమశిల అధికారి హుకూం!

మక్కువగల ఈ అధికారి తనకోళ్ల కాపలాకు కొందరు సిబ్బందికి డ్యూటీ వేస్తున్నాడు. కూరగాయలు తెచ్చిచ్చే బాధ్యతలు మరొకరికి, పైపనులు వేరొకరికి, కాపలాకు ఇంకొందరిని నియమిస్తున్నాడు. ఆఫీసు పనులేగాక ఈ అధికారి వేస్తున్న కొత్త డ్యూటీలకు ఉద్యోగులు వాడలి పోతున్నారు. తాను చేయమన్న పని చేయని వారికి మెమోలు జారీ చేస్తున్నారాయన. తన మాట వినకుంటే బదలీలు చేయిస్తానని, సస్పెండ్ చేస్తానని బెదిరిస్తుండడంతో ఉద్యోగులకు పై డ్యూటీలు వేయక తప్పడం లేదు. మద్యం సేవించి ఆఫీసుకొస్తున్న ఈ అధికారిని చూసి మహిళా ఉద్యోగులు క్షణమొక యుగంలా కాలం గడుపుతున్నారు. ప్రాజెక్ట్ కాలనీలో ఇన్స్‌పెక్షన్ బంగళాలోని పలు వస్తువులను ఈ అధికారి స్వంతం చేసుకొన్నట్లు తెలిసింది. ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తున్న ఈ అధికారిని నియంత్రించే శక్తి సోమశిల ప్రాజెక్ట్ ఎస్ఇకి లేదా? లేక ఆయన్ను సైతం ఈ అధికారి భయపెడుతున్నారా?

### అనంతసాగరంలో బ్రాందీ షాపుల గొడవ

బ్రాందీ అమ్మే బెల్టు షాపులను నిర్మూలిస్తామని ఎక్సైజ్ అధికారులు ఒకవైపు ప్రకటిస్తుంటే, అనంతసాగరం మండలంలో రోజుకో బెల్టు షాపు వెలుస్తూ వారి మాటలు ఉత్తుత్తివని తేల్చి చెబుతున్నాయి. ఇక్కడున్న రెండు బ్రాందీ షాపుల వాళ్లు ఒక ఒప్పందానికి వచ్చి మండలంలోని కొన్ని గ్రామాలను పంచుకొన్నారు. ఈ గ్రామాలకు ఈ రెండు షాపులకు చెందిన ఏజంట్లు వెళ్లి డైరక్ట్‌గా సరకును డెలివరీ చేసివస్తుంటారు. గ్రామ గ్రామాన బ్రాందీ షాపులు తెరవడం వల్ల కొన్నిచోట్ల శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్న మవుతున్నాయి. రాష్ట్రంలో పెద్ద బ్రాందీ షాపుల కాంట్రాక్టర్ చీరాల ధర్మారావుకు అనంతసాగరంలోని బ్రాందీ షాపు 165వది. ఈ షాపును, బారుగా కూడా నడుపుతున్నారాయన. ఈ షాపుకు వెళ్లి ప్రతి దినం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం బిరియాని తినివచ్చే ఎక్సైజ్ పోలీసులు షాపుల వాళ్లు చేసే అక్రమాలను పట్టించుకోరు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు గమనించరు. ఈ ఎక్సైజ్ శాఖాధికారులు నియంత్రించే ఉన్నతాధికారులే జిల్లాలో లేరా? *



చెట్లను పెంచమని ప్రభుత్వం చెబుతుంటే, వాటిని నరికిస్తున్న సంగం మండలాధ్యక్షుడు

# సారా బట్టీల్లో దగ్ధమైన నీతి

ఉదయగిరి మద్యం వ్యాపారులకు కంటి మీద కునుకు లేకుండా చేసిన మహిళా ఎక్సైజ్ సిఐని, చివరకు అధికార పక్షనేతలు సెలవు మీద వెళ్లేలా చేయగలిగారు. ఇక్కడ సిఐగా రెండు నెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి శ్రీదేవి మద్యం వ్యాపారుల పాలిట సింహస్వప్న మయ్యారు. ఆకస్మిక తనిఖీలు చేస్తూ అక్రమార్కులను అరెస్ట్ చేస్తూ సంచలనం సృష్టించారు. నియోజక వర్గంలో దొంగ సారా వ్యాపారాన్నంతా అధికార పార్టీకి చెందిన వారే చేస్తుండడంతో వారంతా ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డిని శరణు జొచ్చారు. ఎమ్మెల్యే రంగ ప్రవేశం చేసి పై అధికారులను కలసి ఆమెను బదలీ చేయమని పట్టుబట్టడంతో మనస్తాపం చెందిన సిఐ సెలవు మీద వెళ్లిపోయారు. నిజాయితీగా పనిచేసే అధికారులకు తెలుగుదేశం పాలనలో రక్షణ లేకుండా పోయింది.

## ఎమ్మెల్యే వత్తిడితో సెలవుపై వెళ్లిన సి.ఐ.!

### సంగంలో జోరుగా పేకాట

సంగం మండలంలోని సంగం, దువ్వూరు, మక్తాపురం గ్రామాల్లో పేకాట జోరుగా సాగుతోంది. సంగంలోని తూర్పుడొంక వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పేకాట ప్రియులకు తీరికే వుండడం లేదు. దువ్వూరులో పంచాయతీ ఆఫీసు ప్రక్కన, పాత రెవిన్యూ బంగళా వద్ద పేకాట రాయుళ్లు యమ బిజీగా వుంటున్నారు. పోలీసులకు పేకాట రాయుళ్లు 'మేజా' చెల్లిస్తుండడంతో వీరి జోలికి వెళ్లడం లేదు. పేకాట రాయుళ్ల వల్ల గ్రామంలో చిన్న చిన్న దొంగతనాలు ఎక్కువయ్యాయని మహిళలు గగ్గోలు పెడుతున్నారు. మరి వీరి వేదనకు స్పందించే పోలీసు అధికారి ఎక్కడున్నాడో?

### దయార్ద్ర హృదయంలేని కావలి పశువుల డాక్టర్

కావలిలోని పశువుల డాక్టర్‌కు దయార్ద్ర హృదయం లేకపోవడంతో పెంపుడు జంతువుల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. ఇక్కడి ప్రభుత్వ పశువుల ఆసుపత్రిలో పనిచేసే డాక్టర్ విధులకు

తొరవ 8వ పేజీలో

# స్వంత పొలానికి జన్మభూమి రోడ్డు!

అధికార పార్టీలో వున్నాననే అహంకారంతో సంగం మండలాధ్యక్షుడు కె. బాలక్రిష్ణారెడ్డి తన పొలానికి వెళ్లేందుకు ప్రజాధనంతో జీప్‌ట్రాక్ వేయించు కొంటున్నారు. సంగం మండలంలోని పడమటి పాళెం - దువ్వూరు బ్రాంచ్ ఛానల్ ఉత్తరపు కాల్వకట్టపై ప్రభుత్వం 1989లో జీప్‌ట్రాక్ ఏర్పాటు చేసింది. ఈ ప్రాంతంలోనే దక్షిణం వైపున తన పొలాలుండడంతో ఈ వైపున మరో జీపుట్రాక్ నిర్మింప జేసేందుకు పంచాయతీ రాజ్ శాఖాధికారులకు చెప్పి, మండలాధ్యక్షుడు ఎస్టిమేషన్లు తయారు చేయించారు. పని మొదలు పెట్టేందుకు ఈ మార్గాన వున్న చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికి పారేస్తున్నా రాయన. కేవలం తన పొలానికి దారికోసం ఏర్పాటు చేస్తున్న ఈ ట్రాక్ నిర్మాణాన్ని ఉన్నతాధికారులు విచారించి, నిలుపుదల చేయిస్తే లక్షలాది రూపాయల ప్రజాధనం మిగులు తుందనడంలో సందేహం లేదు.

### అడ్రస్‌లేని ఆరోగ్య కార్యకర్తలు!

సంగం మండలం కొలగట్ల గ్రామంలో పని చేయాల్సిన ఆరోగ్య కార్యకర్తలు, గత కొన్ని నెలలుగా పత్తా లేకుండా పోయారు. వైద్య ఆరోగ్యశాఖ గ్రామంలో ఆరోగ్య కార్యకర్తగా గ్రేస్‌మేరిని, మిల్ వర్కర్‌గా శివరామకృష్ణ అనే వ్యక్తిని నియమించింది. గ్రేస్ మేరీ నెల్లూరులో కాపురముంటూ ఏడు నెలలుగా గ్రామం వైపు కన్నెత్తి చూడలేదు. ఇటీవల ఆత్మకూరులోని ప్రైవేట్ ఆసుపత్రులలో కుటుంబ నియంత్రణ

## జిల్లావార్తలు

ఆపరేషన్లు చేయించుకొన్న కొందరు మహిళలను కలసి ప్రోత్సాహకాలు ఇప్పిస్తానంటూ వారిచేత కొన్ని పత్రాలపై సంతకాలు పెట్టించుకొని, మళ్లీ కనిపించకుండా పోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నెల్లూరులో వుంటూ కొలగట్ల గ్రామస్తులు క్షేమమని, రికార్డులు వ్రాసి, ఉన్నతాధికారులకు సమర్పిస్తూ సరిపుచ్చు కొంటుందీవిడ. మిల్ వర్కర్ శివరామకృష్ణ

తొరవ 8వ పేజీలో




## చతుర్ధ వర్ధంతి

మా అభివృద్ధికి కారకురాలు

**గున్నంరెడ్డి సరోజనమ్మగారు**

పరమపదించి 4.12.1998 తేదికి నాలుగు సంవత్సరాలు పూర్తయ్యాయి.
చతుర్ధ వర్ధంతి సందర్భంలో వారి పవిత్రాత్మకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

కుమారులు ... కోడళ్ళు

డాక్టర్ జి. కొండారెడ్డి, దంతవైద్యులు ... పద్మావతమ్మ
జి. రఘురామిరెడ్డి ... శ్రీనివాసమ్మ

మనుమలు ... మనుమరాండ్రు

హరికిశోర్‌రెడ్డి, కృష్ణకిశోర్‌రెడ్డి (అమెరికా), మదన్‌మోహన్‌రెడ్డి,
డాక్టర్ ఎర్రంరెడ్డి ప్రసాద్‌రెడ్డి, మమత

